

సోమశిలలో 53.269 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 53.269 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 1080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.94,090
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,510
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,765
నవర (8 గ్రాములు)	రూ.70,120

గరిష్టం/కనిష్టం 35.7 /25.6

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన ఇంటర్ పుస్తకాలు



కేపీసీ జూనియర్ కళాశాలలో దిగుమతి చేస్తున్న ఇంటర్ పుస్తకాలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ద్వితీయ సంవత్సర పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో ఈ పుస్తకాలను భద్రపరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 11 వేల పాఠ్య పుస్తకాలు, 1.19 లక్షల నోటు పుస్తకాలు వచ్చాయి. వీటిని జిల్లాలోని ఆయా ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలలకు బుధవారం నుంచి చేరవేయనున్నారు.

డైట్‌లో అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): పల్లిపాడు డైట్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అధ్యాపక ఖాళీలను డిప్యుటేషన్‌పై భర్తీ చేసేందుకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు, ఎంఈఓల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10వ తేదీలోపు పంపాలన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 16, 17 తేదీల్లో రాత పరీక్ష ఉంటుందన్నారు. 19న ఇంటర్వ్యూలు నిర్వహించి 21న ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్డర్లు తీసుకున్న ఉపాధ్యాయులు ఈ నెల 22న డైట్ కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు.

30న పాలిసెట్

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీన పాలిసెట్ (పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసుదాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి విద్యార్థినులకు ఈ నెల 2వ తేదీ నుంచి 28వ తేదీ వరకు స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల, దర్గామిట్టలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు ప్రవేశ పరీక్షకు సంబంధించి పుస్తకాలను ఉచితంగా ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99123 42048 నంబరులో సంప్రదించాలన్నారు.

ఏపీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు


ఉదయగిరి: జిల్లాలోని నెల్లూరు (అక్కచెరువు), గండిపాళెం, తుమ్మలపెంట, ఆత్మకూరు గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి మిగిలి ఉన్న తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జి.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం, మిగిలి ఉన్న, 6,7,8 తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 6వ తేదీలోపు దాఖలు చేసుకోవాలన్నారు. వీరికి ఈ నెల 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

నెల్లూరురూరల్: పబ్లిక్ లైబ్రరీలు, జిల్లా గ్రంథాలయ సంస్థల వ్యవహారాలను నిర్వహించడానికి జేసీ కార్తీక్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ గవర్నర్ తరపున ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఆరు నెలల కాలం లేదా కొత్త చైర్మన్ నియామకం అయ్యే వరకు ఈ బాధ్యతలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్పొరేట్‌కు దన్నుగా.. ఇంటర్ విద్యా ప్రణాళిక

ఇంటర్ విద్యలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న నూతన సంస్కరణలు కార్పొరేట్ విద్యా వ్యవస్థకు దన్నుగా మారనున్నాయి. ఈ సంస్కరణలు కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ముగిశాయి. తాజా విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ వారం నుంచే అడ్మిషన్లు చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు అనుమతి ఇచ్చేసింది. కొత్త సిలబస్‌తోపాటు కోర్సు అమల్లోకి రానున్నాయి.



నెల్లూరు (టౌన్): ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌లో నూతన సంస్కరణలు అమలు కానున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర సిలబస్‌ను పూర్తిగా మార్చేశారు. కొత్త పాఠ్య పుస్తకాలను ముద్రించి ఇవ్వనున్నారు. ఎంపీసీలో ఇంగ్లిషు, ద్వితీయ లాంగ్వేజీతో పాటు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. గతంలో మ్యాథ్స్ ఏ, మ్యాథ్స్ బీ సబ్జెక్టులు ఉండేవి. వీటికి విడివిడిగా పరీక్షలు నిర్వహించే వారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మ్యాథ్స్‌లో ఒకే పరీక్ష ఉంటుంది. బైపీసీలో ఇంగ్లిషు, ద్వితీయ ల్యాంగేజీతో పాటు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జక్టులు ఉంటాయి. ఇప్పటి వరకు ప్రథమ, ద్వితీయ లాంగ్వేజీలతో పాటు బాటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉన్నాయి. వీటికి విడివిడిగా పరీక్షలు నిర్వహించే వారు. ద్వితీయ లాంగ్వేజీకి సంబంధించి గతంలో 10 ఆప్షన్లు ఉండేవి. ఈ విద్యా సంవత్సరంలో మరో 14 కలిపి మొత్తం 24 ఆప్షన్లు ఇచ్చారు. ఈ ఆప్షన్లలో రెండో లాంగ్వేజీగా గ్రూప్ సబ్జెక్టును ఎంచుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీతో పాటు ఎంబైపీసీతో కొత్త కోర్సు ప్రవేశ పెట్టారు. ఎంబైపీసీలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులు ఉంటాయి. ఈ కోర్సు విద్యార్థులు నీట్‌తో పాటు జేఈఈ మెయిన్స్ పరీక్ష రాసే విధంగా అవకాశం కల్పించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరంలో సిలబస్‌ను మార్పు చేయనున్నారు. గతంలో పరీక్షల్లో 1 మార్కు ప్రశ్నలు ఉండేవి కావు. ఈ విద్యా సంవత్సరం ప్రథమ సంవత్సర విద్యార్థులకు మొత్తం మార్కుల్లో 10 శాతం మార్కులకు 1 మార్కు ప్రశ్నలు ఇవ్వనున్నారు. ఆర్ట్స్ గ్రూపులో కేవలం సిలబస్‌ను మాత్రమే మార్పులు చేస్తున్నారు. కోర్సులు మాత్రం అవే ఉంటాయి. కళాశాల వేళలు కూడా మార్పులు చేశారు. గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు 7 పీరియడ్లు ఉండేవి. ఈ విద్యా సంవత్సరంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 8 పీరియడ్లు నిర్వహించాలని నిర్ణయించారు. నూతన సిలబస్‌కు సంబంధించి అధ్యాపకులకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు.



తరగతి గదిలో ఇంటర్ విద్యార్థులు

ఇంత హడావుడి ఎందుకు?

గతంలో పరీక్షల అనంతరం వేసవి సెలవులు ఇచ్చేవారు. జూన్ 1వ తేదీ నుంచి జూనియర్ కళాశాలలను పునః ప్రారంభించే పరిస్థితి ఉండేది. అయితే ఎన్నడూ లేని విధంగా తాజాగా ఈ నెల 1వ తేదీ నంచే జూనియర్ కళాశాలలను పునః ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వెనుక కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు మేలు చేకూర్చేందుకే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే అడ్మిషన్లు, కళాశాలలు ప్రారంభించడం తమపై ఒత్తిడి పెంచడమే అని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఫీజులు గుంజుతున్న కార్పొరేట్ యాజమాన్యాలు

ప్రథమ సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లను ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభించాలని ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. వేసవి సెలవులు ఇచ్చేంత వరకు బ్రిడ్జి కోర్సుకు మాత్రమే తరగతులు నిర్వహించాలని సూచించింది. ఇంటర్‌లో అమలు చేయనున్న నూతన సంస్కరణలు కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటర్ అడ్మిషన్ల సమయంలో కేవలం ప్రొవిజనల్ అడ్మిషన్ కింద నామినల్ ఫీజును మాత్రమే తీసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు నిర్ణయించారు. పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పది ఫలితాలు రావాలంటే మరో 20 రోజులకు పైగా సమయం పడుతుంది. ఈ ఫలితాల్లో ఎంత మంది పాస్ లేదా ఫెయిల్ అవుతారో తెలియదు. ఈ ఫలితాలు రాకుండానే ఇంటర్ అడ్మిషన్లు అంటే విద్యార్థుల తల్లిదండ్రులకు గోరు చుట్టుపై రోకలిపోటుగా మారనుంది.



కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆయా కళాశాలల యాజమాన్యాలు మాత్రం ప్రారంభం నుంచే రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తామని చెబుతున్నాయి. అయితే నామినల్ ఫీజును పక్కన బెట్టి రెగ్యులర్ ఫీజును వసూలు చేస్తున్నారు. మొత్తం ఫీజులో 50 శాతం ఫీజు చెల్లిస్తేనే పర్మినెంట్ అడ్మిషన్ ఇస్తామని చెబుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వేసవి సెలవుల అనంతరం అడ్మిషన్ అయితే ఫీజు ఎక్కువగా ఉంటుందని చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు. చేసేదేమి లేక కొంత మంది 50 శాతం ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఫీజు వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటర్‌లో హాజరు అంతంత మాత్రమే..

- నాలుగైదు కళాశాలల్లోనే మధ్యాహ్న భోజనం

నెల్లూరు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ తొలి వారం నుంచే జూనియర్ కళాశాలలు ప్రారంభించడంతో విద్యార్థులు తరగతులకు ముఖం చాటేశారు. తొలి రోజు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 శాతం మంది మాత్రమే హాజరైనట్లు ఇంటర్‌బోర్డు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 23 ప్రభుత్వ, 2 ఎయిడెడ్, 1 మున్సిపల్‌తో పాటు ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, బీసీ వెల్ఫేర్ తదితరాలు కలిపి మొత్తం 51 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 6 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్ జూనియర్ కళాశాలల్లో 3,350 మంది విద్యార్థులకు తొలిరోజు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీటిల్లో నాలుగైదు జూనియర్ కళాశాలల్లో మాత్రమే మధ్యాహ్న భోజనం పెట్టారు. మిగిలిన కళాశాలల్లో అమలు చేయకపోవడంతో విద్యార్థులు భోజనానికి ఇబ్బందులు పడిన పరిస్థితి ఉంది. జిల్లాలో మిగిలిన కేజీబీవీ, మోడల్, బీసీ వెల్ఫేర్ తదితర కళాశాలల్లో కూడా తక్కువ మొత్తంలో విద్యార్థులు హాజరైనట్లు చెబుతున్నారు.

తాత్కాలిక ఫీజును మాత్రమే వసూలు చేయాలి



ఇంటర్‌లో మంగళవారం నుంచి కేవలం బ్రిడ్జి కోర్సు మాత్రమే చెప్పాలి. అడ్మిషన్లకు సంబంధించి యాజమాన్యాలు నామినల్ ఫీజు వసూలు చేసుకోవచ్చు. జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కళాశాలల పునః ప్రారంభంలో రెగ్యులర్ ఫీజును వసూలు చేసుకోవాల్సిందే తప్ప.. ఇప్పుడే పూర్తిగా చెల్లించాలని, సగం చెల్లించాలని ఒత్తిడి చేయొద్దు. ఈ విషయంపై రెండు రోజుల్లో ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. – ఆదూరు శ్రీనివాసులు, ఆర్‌ఐఓ

నిత్యం ప్రజల మధ్యలోనే కాకాణి

- కాకాణిపై అక్రమ కేసు.. ఇది టీడీపీ ఆట
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఫైర్

కావలి: రాష్ట్రంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల మీద కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తుందని, అందులో భాగంగా జిల్లాలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని ప్రభుత్వం కుట్రలు చేస్తోందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ మేరకు మంగవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా రాజకీయాల్లో ఎప్పుడూ చూడని విధంగా సీనియర్ నాయకుల మీద అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని మండి పడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కాలని కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు తెరలేపిందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టి మళ్లించాలని చూస్తుందని విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి కాకాణి ఎప్పుడూ జిల్లాలో, నియోజకవర్గంలోనే ఉంటారన్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పండగ జరుపుకోవడానికి హైదరాబాద్‌కు వెళ్లినప్పుడు పోలీసులు స్టేషన్కు రమ్మని నోటీసు ఇవ్వడం సరికాదు. గత శనివారం వరకు కాకాణి నెల్లూరులోనే ఉన్నారు. ఇది కేవలం టీడీపీ పోలీసులతో ఆడిస్తున్న ఆట అని ఆయన ధ్వజమెత్తారు. ఇలా అక్రమ కేసులు బనాయించి వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకోవాలని చూడడం దుర్మార్గం అన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు, శ్రేణులు ఇలాంటి అక్రమ కేసులకు భయపడే వారు కాదని ప్రతాప్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

కేంద్రియ విద్యాలయంలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు సిటీ: నెల్లూరులోని కేంద్రియ విద్యాలయంలో ఈ నెల 11వ తేదీ వరకు రెండో తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ శంకరయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యాలయ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని పూర్తి చేసి అందజేయాలన్నారు. రెండో తరగతిలో 9 సీట్లు, మూడు 15, నాలుగు 19, ఐదు 25, ఆరు 9, ఏడు 16, ఎనిమిది 16, తొమ్మిది తరగతుల్లో 6 సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు జాబితా 17వ తేదీన తెలియజేస్తామన్నారు. ఇతర వివరాలకు https:// kothuru. kvs. ac. in లో నోటీసు బోర్డును సందర్శించవచ్చన్నారు.

ప్యాసింజర్ రైళ్లు రద్దు

నెల్లూరు సిటీ: ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు విజయవాడ-గూడూరు మధ్య నడిచే రైళ్లను రద్దు చేశారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని టంగుటూరు సమీపంలోని మూడో ట్రాక్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ మార్గంలో నడిచే రైళ్లు రద్దు చేశారు. 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నడిచే విజయవాడ-గూడూరు ప్యాసింజర్ రద్దు చేశారు. అదే విధంగా 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గూడూరు-విజయవాడ ప్యాసింజర్, 8వ తేదీన నెల్లూరు-విజయవాడ ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి.

డీసీపల్లిలో 504 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 504 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 533 బేళ్లు రాగా 504 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 65,363 కిలోల పొగాకును విక్రయించగా రూ.17824839.50 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.250 లభించింది. సగటు ధర రూ.272.71గా నమోదైంది. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇళ్లపై టీడీపీ నేతల దాడి



కళ్యాణ్ కుమార్ ఇంటి వద్ద దుకాణం ధ్వంసం



కోటయ్య బంధువుల ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణకు దిగిన టీడీపీ నేతలు

- రేషన్ పంపిణీ విషయమై వివాదం
- ఇళ్లలోని వస్తువులు, సామగ్రి ధ్వంసం

కందుకూరు రూరల్: రేషన్ బియ్యం పంపిణీ విషయమై చెలరేగిన వివాదం దాడులకు దారితీసింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఓగూరు ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. ఓగూరు ఎస్సీ కాలనీలో ఎండీయూ వాహనంలో బియ్యం పంపిణీ చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ ఇద్దరు మహిళలు బియ్యం ఇవ్వాలని వాహనం వద్దకు వెళ్లారు. మీరు గ్రామంలో ఉండడం లేదు. మీకు బియ్యం ఇవ్వం, డబ్బులు మాత్రమే ఇస్తామని అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్త పి.రఘు దబాయిస్తూ చెప్పాడు. ఈ విషయాన్ని ఆ మహిళలు వైఎస్సార్‌సీపీ నేత డీ కోటయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వాహనం వద్దకు వెళ్లి వారికి బియ్యం ఇవ్వండని అని ఆపరేటర్ రాజాకు చెప్పాడు. అ పక్కనే ఉన్న రఘు అనుచరుడు పీ రవికిరణ్ నువ్వు ఎవడివి రా అంటూ దురుసుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో కోటయ్య తన కారులో బంధువులను రైలు ఎక్కించేందుకు వెళ్తుంగా రఘు, రవికిరణ్ అనుచరులు కొందరు కారును అడ్డుకున్నారు. అక్కడ ఘర్షణ జరుతుండగా కోటయ్యకు కొందరు మద్దతుగా వచ్చి కారును పంపించారు. దీంతో కోటయ్య, ఆయన కుమారుడు కళ్యాణ్ కుమార్ కారులో వెళ్లిపోయారు. టీడీపీ కార్యకర్త రఘు, రవి కిరణ్‌లతోపాటు వారి అనుచరులు వైఎస్సార్‌సీపీకి చెందిన కోటయ్యకు మద్దతుగా వచ్చిన వారి ఇళ్ల మీదకు వెళ్లి ఘర్షణకు దిగి దాడి చేశారు. కోటయ్య కుమారుడు ఇంటి వద్దకు ఉన్న దుకాణంలో సామగ్రిని, ఇంట్లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల్లోని నలుగురికి గాయాలయ్యాయి. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎం.వెంకటేశ్వర్లు, ఎం.వెంకట్రావు గాయపడ్డారు. కందుకూరులో ఉన్న కోటయ్య నివాసానికి టీడీపీ వర్గీయులు వెళ్లారు. సుమారు పది మందికి పైగా బైక్‌లపై వచ్చి సీసీ కెమెరాలు పగులగొట్టి, అసభ్య పదలు తిడుతూ హంగామా సృష్టించి భయాందోళనకు గురి చేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడిని నుంచి వెళ్లిపోయారు. కందుకూరు రూరల్ పోలీసులు ఓగూరులో, పట్టణ పోలీసులు కందుకూరులో జరిగిన ఘటను పరిశీలించి ఇరువర్గాలను విచారిస్తున్నారు.

89 ఎర్రచందనం దుంగల పట్టివేత



సీజ్ చేసిన దుంగలు, వాహనంతో ఫారెస్ట్ అధికారులు

రాపూరు : మండలంలోని మద్దెల మడుల చెక్‌పోస్టు వద్ద మంగళవారం 89 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటగిరి వైపు అధిక వేగంతో వెళుతున్న తమిళనాడుకు చెందిన మినీ ట్రక్‌ను ఫారెస్ట్ సిబ్బంది అడ్డుకున్నారు. ఎండు గడ్డి లోడ్‌తో ఉన్న ట్రక్‌ను వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. దీంతో వాహనంలో తనిఖీ చేయగా గడ్డి మోపుల కింద రూ.15 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. ఎర్రచందనంతోపాటు వాహనాన్ని కూడా సీజ్ చేసినట్లు రాపూరు అటవీ శాఖ రేంజర్ రవీంద్రబాబు వెల్లడించారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ వరప్రసాద్, చక్రపాణి, చంద్రశేఖర్, బీట్ అధికారులు షఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగల దుకాణంలో చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

ఆత్మకూరు: పట్టణంలోని మెయిన్‌బజారులో బంగారు నగల దుకాణానికి తాళం వేస్తూ పక్కన పెట్టిన నగలు, నగదు సంచిని సోమవారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. సీఐ జి.గంగాధర్, ఎస్సై బి సాయిప్రసాద్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలో పలు చోట్ల ఉన్న సీసీ కెమెరాల్లోని పుటేజీలను పరిశీలిస్తున్నారు. రెండు రోజులుగా ఆ దుకాణం వద్ద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు రెక్కీ నిర్వహించినట్లు పక్కనే టీ షాపులో ఎక్కువ సమయం గడిపినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ జరగడానికి కొద్ది సేపు ముందు బైక్‌ను ఓ యువకుడు సిద్ధంగా ఉండగా మరో యువకుడు దుకాణం మూసివేస్తున్న రమణమూర్తి వద్దకు వెళ్లి ఆయనకు తెలియకుండా సంచిని అపహరించి, సిద్ధంగా ఉన్న బైక్ వద్దకు వచ్చి పారిపోయిన విషయం సీసీ పుటేజీల్లో నమోదైంది. వారిని గుర్తించి త్వరలోనే కేసును ఛేదిస్తామని మంగళవారం పోలీసులు తెలిపారు.

హమ్మయ్య.. పరీక్షలు ముగిశాయ్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఇవి గత నెల 17వ తేదీన మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 174 కేంద్రాల్లో ఎగ్జామ్స్ జరిగాయి. చివరిరోజు జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 29,105 మందికి గానూ 28,870 మంది హాజరుకాగా.. 235 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్‌కు సంబంధించి 205 మందికి గానూ 181 మంది హాజరుకాగా.. 24 మంది గైర్హాజరయ్యారు. ఎగ్జామ్స్ ముగియడంతో విద్యార్థులు కేంద్రాల వద్ద ఉత్సాహంగా కనిపించారు. ప్రశ్నపత్రాలను చించి గాల్లోకి ఎగురేసి కేరింతలతో ఆనందాలను పంచుకున్నారు. కేంద్రాల వద్దకు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున రావడంతో సందడి వాతావరణం నెలకొంది. – నెల్లూరు(టౌన్)





పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు

నెల్లూరులో పరీక్ష కేంద్రం బయట ఇలా..



క్లుప్తంగా

రైల్వే గేట్ వద్ద మృతదేహం



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం నెల్లూరు రంగనాయకులపేట రైల్వే గేట్ వద్ద చోటుచేసుకుంది. మృతుడి వయసు సుమారు 65 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, తెలుపు రంగు గీతల లుంగీ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటనపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. గోమతి నగర్‌లో ప్రసాద్‌రావు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతను వాట్సాప్ గ్రూప్‌లో ఇటీవల పీఎం కిసాన్ పేరిట వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేశాడు. గతనెల 29వ తేదీన తన ఫోన్‌పే యాప్‌ను తెరిచాడు. అతని బ్యాంక్ ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.2,59,970ల నగదు విత్‌డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ప్రసాదరావు తక్షణమే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. బాధితుడు మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరు మాగుంట లేఅవుట్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై మంగళవారం జరిగింది. మృతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఎరుపు రంగు గీతల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. ప్రమాదంలో మృతదేహం ఛిద్రమైంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.110
సన్నవి : రూ.80
పండ్లు : రూ.50



కూటమి గుప్పెట్లో 'సోషల్ ఆడిట్'

- టీడీపీ నేతల ఇష్టారాజ్యం
- తమకు అనుకూలంగా ఉండే వారితో ఎఫ్ఏలపై ఫిర్యాదు
- రూ.లక్షల్లో రికవరీలు విధిస్తున్న వైనం
- ఆవేదన చెందుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

నెల్లూరు(పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూటమి నేతల కనుసన్నల్లో నడుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్లపై తప్పుడు ఫిర్యాదులు చేయించి రికవరీలు విధించేలా చక్రం తిప్పుతున్నారు. ఇటీవల కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలంలో ఈ తరహా ఘటనలు చోటు చేసుకున్నాయి.

ఎక్కడంటే..

దగదర్తి మండలంలోని ధర్మవరం, చెన్నూరు, తురిమెర్ల, బోడగుడిపాడు ఫీల్డ్ అసిస్టెంట్లపై టీడీపీ నాయకులు కక్ష కట్టారు. వారితో ఎలా అయినా రాజీనామా చేయించాలని నిర్ణయించుకుని గ్రామసభల్ని తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఇటీవల ఆ మండలంలో సోషల్ ఆడిట్ జరిగింది. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండే సర్పంచ్‌లు దీనికి హాజరయ్యారు. అక్కడున్న టీడీపీ నాయకులు మీకేం సంబంధమంటూ వారిని అడ్డుకున్నారు. వెళ్లిపోవాలంటూ హెచ్చరించి గొడవకు దిగారు.

ఒక్కోచోట ఇలా..

ఇటీవల ధర్మవరంలో గ్రామ సభ జరిగింది. ఇందులో టీడీపీకి అనుకూలంగా ఉండే వారు పనులకు హాజరైనా రాలేదంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సభ జరగక ముందే ఎఫ్ఏను రాజీనామా చేయాలని, లేకపోతే రూ.లక్షల్లో రికవరీలు విధించి కేసులు నమోదు చేయిస్తామంటూ హెచ్చరించి ఉన్నారు. అయితే ఎఫ్ఏ వినకపోవడంతో రూ.2 లక్షలకు పైగా రికవరీ విధించినట్లు సమాచారం. చెన్నూరు గ్రామసభలో సర్పంచ్‌కు బదులు ఆమె భర్త అంతా తానై వ్యవహరించాడు. ఆయనతోపాటు టీడీపీ నాయకుడు వేదికపై కూర్చొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి టీడీపీకి అనుకూలంగా ఉండే వ్యక్తిని నియమించుకునేలా ప్రయత్నించారు. తురిమెర్ల సభలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై టీడీపీ నాయకులు తిట్ల పురాణానికి దిగారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు నేతలకు అనుకూలంగా వ్యవహరించారు. రాజీనామా చేయమంటే చేయవా? అంత అహంకారమా? నీ అంతు చూస్తామంటూ నేతలు బెదిరింపులకు దిగారు. బోడగుడిపాడుకు హౌసింగ్ శాఖ వారు తప్పు చేస్తే రికవరీ మాత్రం ఎఫ్ఏపై పడింది.



ఇటీవల చెన్నూరులో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

చర్యలు వారిపైనేనా..

సంవత్సరం పాటు ఉపాధి కూలీలు పనిచేసిన రోజులకు సంబంధించి పేమెంట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమై ఉన్నాయి. అధికారులు దీనిపై దృష్టి పెట్టకుండా టీడీపీకి అనుకూలంగా ఉండే వారి ఫిర్యాదుల ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.లక్షల్లో రికవరీలు విధిస్తున్నారు. పనులకు రాలేదని సోషల్ ఆడిట్‌లో చెప్పినంత మాత్రన విచారించకుండా రికవరీలు వేయడంపై ఎఫ్ఏలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులకు వచ్చి రాలేదని అబద్ధాలు ఆడిన టీడీపీ మద్దతుదారులపై విచారించి బ్యాంక్ స్టేట్‌మెంట్ తీస్తే ఎవరు పొరపాటు చేశారో తెలిసిపోతుంది. అయితే అధికారులు అటువైపుగా ఆలోచన చేయడం లేదు. కూటమి నేతలు చెప్పిందే చేస్తున్నారు. సామాజిక తనిఖీల్లో రికవరీలు విధించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఈసీలు, సీఓలు, ఏపీఓలు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ వద్ద విచారణకు హాజరు కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాన అనంతరం ప్రజాప్రతినిధులు చెప్పిన వారిని ఎఫ్ఏలుగా నియమించేందుకు సామాజిక తనిఖీల్లో రికవరీలు విధించడం పరిపాటిగా మారింది. ఈ సమస్యను విన్నవించుకునే అవకాశాలను ఇవ్వడం లేదు. వీటి ఫలితంగా వందలాది మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సోషల్ ఆడిట్ జరుగుతోంది. అధిక శాతం మండలాల్లో పూర్తయ్యాయి. రికవరీలు విధించిన సిబ్బందిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నాం. పూర్తి వివరాలను సేకరించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– గంగాభవాని, డ్వామా పీడీ

ఈత కొట్టేందుకు వెళ్లి..

- ఉత్తరకాలువలో కొట్టుకుపోయి యువకుడి మృతి
- మినగల్లులో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మస్తాన్‌బాషా (ఫైల్)

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని మినగల్లు గ్రామంలో ఓ యువకుడు ఈతకెళ్లి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ హుస్సేన్, దిల్షాద్ దంపతులకు షేక్ మస్తాన్‌బాషా (21) అనే కుమారుడు ఉన్నాడు. అతను డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రంజాన్ సందర్భంగా సోమవారం సాయంత్రం అతను తన స్నేహితులతో కలిసి సోమశిల ఉత్తరకాలువ వద్దకు వెళ్లాడు. సరదాగా ఈత కొడుతుండగా నీట మునిగి కొట్టుకుపోతుండటంతో స్నేహితులు గమనించి రక్షించేందుకు ప్రయత్నించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో మస్తాన్ గల్లంతయ్యాడని నిర్ధారించి అనంతసాగరం పోలీసులకు రాత్రి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రవాహం అధికంగా ఉందని మస్తాన్ ఆచూకీ దొరకదని భావించారు. జలాశయం నుంచి కాలువకు నీటి విడుదలను ఆపివేయించారు. మంగళవారం ఉదయానికి నల్లరాజుపాళెం రోడ్డు కాలువలో మృతదేహం లభ్యం కాగా దానిని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించామని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. మస్తాన్‌బాషా మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

స్నేహితుడిపై కత్తితో దాడి

- హత్యాయత్నం కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన అన్నదమ్ములపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఖుద్దూస్ నగర్‌కు చెందిన ఆసిఫ్ బంగారు పనిచేస్తుంటాడు. రంజాన్ పండగ సందర్భంగా అతను తన స్నేహితులైన తాహిర్, మస్తాన్, సయ్యద్, అస్గర్, హమీద్, అహ్మద్, యస్దాని, సాబిర్, షఫీ తదితరులతో కలిసి మాగుంట లేఅవుట్‌లోని ఓ లాడ్జికి వెళ్లాడు. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. స్నేహితులందరూ మద్యం తాగుతుండగా ఆసిఫ్ కూర్చొని వారితో మాట్లాడసాగాడు. స్నేహితుడు సాబిర్ మద్యం మత్తులో ఆసిఫ్‌తో గొడవపడ్డాడు. ఇద్దరూ నెట్టుకున్నారు. అనంతరం ఆసిఫ్ లాడ్జిలో నుంచి బయటకొచ్చాడు. ఈక్రమంలో సాబిర్ అన్న షఫీ.. ఆసిఫ్‌ను అడ్డుకున్నాడు. మా తమ్ముడితోనే గొడవపడతావా? నీకెంత ధైర్యమంటూ తన వద్దనున్న కత్తితో ఆసిఫ్ పొట్టలో పొడిచాడు. సాబిర్ సైతం ఇంకా పొడువు అంటూ అన్నను ప్రోత్సహించాడు. ఇంతలో మిగిలిన వారు అన్నదమ్ములను అడ్డుకున్నారు. గాయాలపాలైన ఆసిఫ్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ హాస్పిటల్లో చేర్పించారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై రమేష్‌బాబు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారంతో ఉడాయింపు

- నిందితుడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఆభరణాలు తయారు చేసేందుకు ఇచ్చిన బంగారంతో వ్యక్తి ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండపాలవీధికి చెందిన మోహన్‌లాల్ అరవిందకుమార్ బంగారు ఆభరణాల హోల్‌సేల్ వ్యాపారి. అతను పది సంవత్సరాలుగా షాకీర్ అనే వ్యక్తి వద్ద బంగారు ఆభరణాలు తయారు చేస్తున్నాడు. అరవిందకుమార్ ఫిబ్రవరి 15వ తేదీన ఆభరణాల తయారీ నిమిత్తం 440 గ్రాముల బంగారాన్ని షాకీర్‌కు ఇచ్చాడు. అతను మార్చి 11వ తేదీన అరవిందకుమార్ వద్దకు వచ్చి వస్తువులన్నీ తయారు చేశానని ఫినిషింగ్ చేసి మరుసటి రోజు ఇస్తానని చెప్పాడు. పక్కరోజు నుంచి షాకీర్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. అరవిందకుమార్ ఇంటి వద్దకు వెళ్లి విచారించగా అతను లేడని తేలింది. దీంతో బాధితుడు గాలించాడు. జాడ తెలియకపోవడంతో మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

మద్యం తాగి.. ప్రాణాలు పోగొట్టుకుని..

కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోంది. కావలి నియోజకవర్గంలో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

- మత్తులో కాలువలో పడి ఒకరు
- అతిగా సేవించి మరొకరు



వెంకటరమణయ్య బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

కావలి: కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామ పరిధిలో కావలి – పెద్దపవని రోడ్డులో జలదంకి మండలం లింగరాజు అగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద ఇటీవల మద్యం షాపు ఏర్పాటు చేశారు. లింగరాజు అగ్రహారం గ్రామానికి చెందిన వెంకటరమణయ్య (60) అనే దళితుడు మంగళవారం ఆ షాపులో మద్యం తాగి తన టీవీఎస్ మోపెడ్‌పై గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో కావలి కాలువపై పిట్టగోడ లేని కల్వర్టు వద్ద వాహనం అదుపు తప్పింది. దీంతో రమణయ్య కాలువలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి కాలువలో దిగి పైకి లేపగా అప్పటికే రమణయ్య మరణించినట్లు గుర్తించారు. మూగజీవాలు మేపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తి గ్రామానికి సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల ప్రాణాలు కోల్పోయాడని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అతిగా తాగి..

అల్లూరు: అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అల్లూరు క్రిస్టియన్‌పేట కాలనీలో మంగళవారం జరిగింది. ఎస్సై కిశోర్‌బాబు కథనం మేరకు.. వాకాడు మండలం నిమ్మవారితిప్ప గ్రామానికి చెందిన దండిపూడి వెంకటేష్ (27), భార్య పావనితో కలిసి సంవత్సర కాలంగా అల్లూరు క్రిస్టియన్‌పేటలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తుంటారు. సోమవారం పావని తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉందని స్వగ్రామానికి వెళ్లింది. మంగళవారం ఉదయం నుంచి వెంకటేష్‌కు అతడి అన్న మోషే ఫోన్ చేస్తున్నాడు. రిసీవ్ చేయకపోవడంతో అమర్ అనే వ్యక్తిని ఇంటికి పంపి చూడగా వెంకటేష్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఈ విషయాన్ని మోషేకు చెప్పడంతో అతను వచ్చి చూసి చనిపోయినట్లు గుర్తించి అల్లూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ఇచ్చారు. మృతుడి పక్కన మద్యం బాటిళ్లు ఉన్నాయి. వెంకటేష్ అతిగా మద్యం తాగి చనిపోయి ఉండొచ్చని అతడి అన్న పోలీసుకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేష్ మృతదేహం

విద్యుదాఘాతానికి గురై..

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి

దుత్తలూరు: విద్యుదాఘాతానికి గురై వెంగమాంబ దేవస్థాన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి నర్రవాడలో జరిగింది. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. నర్రవాడకు చెందిన ఉదయగిరి సురేష్ (38) వెంగమాంబ పేరంటాలు ఆలయంలో కొన్ని సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం రాత్రి ఆలయానికి సమీపంలో ఉన్న కొబ్బరికాయల దుకాణం వద్ద నిర్వాహకులు వెల్డింగ్ పనులు చేయిస్తున్నారు. ఆ సమయంలో సురేష్ అక్కడున్న ఇనుప పైపును పట్టుకుని వెల్డింగ్ పనుల్ని చూస్తున్నాడు. అనుకోకుండా ఆ పైపునకు విద్యుత్ సరఫరా కావడంతో సురేష్ షాక్‌కు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే స్థానికులు అతడిని రక్షించేందుకు ప్రయత్నించారు. 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే సురేష్ మృతిచెందినట్లు నిర్ధారించారు. అతడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. గ్రామంలో విషాదం నెలకొంది. మంగళవారం ఎస్సై ఆదిలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.




సురేష్ మృతదేహం

రిజిస్ట్రేషన్లకు నేటి నుంచి స్లాట్ బుకింగ్

నెల్లూరు సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని బుధవారం ఆర్ఓ కార్యాలయంలో ప్రారంభించనున్నారు. జిల్లాలోని ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నెలాఖరు నాటికి అమలు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నిస్తున్నారు.

కండలేరులో 48.517 టీఎంసీలు



జలాశయం (ఫైల్)

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 48.517 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

250 మంది విద్యార్థుల ఎంపిక



పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

నెల్లూరు(టౌన్): సైంటిఫిక్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులను ఎంపిక చేశామని జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చెముడుగుంటలోని జిల్లా సైన్స్ కేంద్రంలో విజిట్‌కు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, సెకండరీ స్థాయికి సంబంధించి ఎంపిక చేసిన 250 మంది విద్యార్థులు బుధవారం చెన్నైలోని పెరియార్ సైన్స్ సెంటర్, గిండి నేషనల్ పార్క్, మద్రాస్ ఐఐటీ సైన్స్ కేంద్రాలను విజిట్ చేస్తారన్నారు. ఉదయం 5 గంటలకు విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లు జిల్లా సైన్స్ కేంద్రానికి చేరుకోవాలన్నారు.